

తపాలా బీ(ధీ)మా..

తపాలా శాఖ తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ ప్రయోజనం చేకూరేలా ప్రమాద బీమా పథకాలను అందుబాటులోకి తెచ్చింది. హెల్త్‌ప్లస్, ఎక్స్‌ప్రెస్ హెల్త్ స్కీంలను ప్రవేశపెట్టింది. 8లో▸



సాగు 'స్వర్ణ'మయమయ్యేనా?

సారంగపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు ఉపకాల్వలు అధ్వానంగా మారాయి. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
43.4 /31.3

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఉదయం నుంచే వేడి తీవ్రంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల విధుల్లో పోలీసుల పనితీరు భేష్

- ఎస్పీ జానకీషర్మిల



పోలీస్ సిబ్బందితో జిల్లా ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: సమన్వయంతో పనిచేసి లోక్‌సభ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా పోలీసుల పనితీరు అభినందనీయమని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించండంలో శ్రమించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని సిటీ కన్వెన్షన్ హాల్‌లో నిర్మల్, భైంసా సబ్ డివిజన్ పోలీసు సిబ్బందితో బుధవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా పనిచేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయడం ద్వారా ఎన్నికల నిర్వహణ మరింత సులభతరమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యునుస్ అలీ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అపోహలు వీడండి



అవగాహన కల్పిస్తున్న వైద్యుడుగణేశ్

నిర్మల్‌టౌన్: క్యాన్సర్‌పై ప్రజలు అపోహలు వీడాలని, ఎంతటి ప్రాణాంతకమైన క్యాన్సర్ అయినా వైద్యంతో నయం చేయవచ్చని సీనియర్ హెమటాలజిస్ట్ డాక్టర్ గణేశ్‌జైషెత్వార్ అన్నారు. ప్రపంచ రక్త క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో యశోద ఆసుపత్రికి చెందిన వైద్యులు బుధవారం రోగులకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ రావడానికి కారణాలు, వాటి నిర్ధారణ, తీసుకోవాల్సిన వైద్యం తదితర అంశాలను వివరించారు. జిల్లాలో క్యాన్సర్ బారిన పడి కోలుకున్నవారితో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలకుర్తి నవీన్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డీపీవో పర్యటన



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీవో

ఖానాపూర్: మండలంలోని రాజురా, చందునాయక్ తండా, సింగాపూర్ గ్రామాల్లో డీపీవో శ్రీనివాస్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పంచాయతీ ఆస్తులు వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. వర్షాకాలం ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకుని హరితహారం నర్సరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపీవో చంద్రశేఖర్, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

జాతీయస్థాయిలో జిల్లాకు గుర్తింపు తేవాలి



క్రీడాకారులతో జిల్లా క్రీడల అధికారి నఫేఖాన్

భైంసాటౌన్: క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో జాతీయస్థాయిలో జిల్లాకు గుర్తింపు తేవాలని జిల్లా యువజన క్రీడల అధికారి నఫేఖాన్ అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా వుషూ శిక్షణ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ గురించి కోచ్ సాయికృష్ణను అడిగి తెలుసుకున్నారు. జూన్ 10 నుంచి 13 వరకు కర్ణాటకలో జరిగే ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఉమెన్స్ వుషూ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయిలో సత్తాచాటాలని సూచించారు.

మెరుగైన సేవలు అందించాలి

మామడ: 108 అంబులెన్స్ సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించాలని ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న ఫార్మలాజికల్ మెడిసిన్, ఆక్సిజన్ పరికరాలు, ఛాతినొప్పి వచ్చినపుడు వాడే ఏఈడీ పరికరం ఎక్విప్‌మెంట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అపాయంలో ఉన్నవారిని త్వరగా ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి మధు, సిబ్బంది సల్కం శేఖర్, ఆఫీజ్, తిరుపతి, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.


నెత్తిన నిప్పుల కొలిమి..



మధ్యాహ్నం నిర్మానుష్యంగా నిర్మల్ శివాజీ చౌక్



చిన్నారులతో ఎండలో ఊరిబాట



జిల్లా అంతటా ఆరంజ్ అలర్ట్



ఆస్పత్రుల్లో చిన్నారులు..

- జిల్లాలో భగ్గుమన్న భానుడు
- రోహిణిలో రోకళ్లు పగిలేలా ఎండ
- బుట్టాపూర్‌లో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- జిల్లా అంతటా 44 డిగ్రీలపైనే..
- ఉష్ణతాపానికి అల్లాడుతున్న జిల్లావాసులు
- మరో రెండురోజులూ ఇదే పరిస్థితి..

నిర్మల్: వామ్మో.. ఇది మామూలు ఎండకాదు. నెత్తి మీద నిప్పుల కొలిమి ఉందా.. అన్నంత తీవ్రమైన ఉష్ణోగ్రత. రోహిణి కార్తె ప్రవేశంతో జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. బుధవారం జిల్లా అంతా 44 డిగ్రీ సెల్సియస్‌కుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దస్తురాబాద్ మండలం బుట్టాపూర్‌లో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణతాపానికి చిన్నారులు, వృద్ధులు విలవిలలాడారు. చాలామంది వడదెబ్బకు గురయ్యారు. ఇంటిపట్టున ఉన్నప్పటికీ వేసవి తాపాన్ని భరించలేకపోయారు. ఒక్కరోజుకే ఇలా ఉంటే.. మరో రెండు రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. వేసవి ముగింపులో రోహిణి ఎండలు దంచికొట్టడంతో కంగారు పడుతున్నారు.

44–45 డిగ్రీల వరకు..

జిల్లాలో ఈ సీజన్‌లోనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మొదట్లో 40–42వరకు మాత్రమే ఉండగా, మధ్యలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత లు కొనసాగాయి. వేసవి ముగింపు సమయంలో సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. జిల్లాలో బుధవారం జిల్లా అంతటా 44 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలంగాణ ప్రణాళిక శాఖ నివేదికలు పేర్కొన్నాయి. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలతోపాటు సారంగపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఏకంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలుపుతున్నాయి. సీజన్ మొదట్లో కూడా దస్తురాబాద్ మండలంలో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మళ్లీ ఇప్పుడు అదే స్థాయిలో నమోదవుతున్నాయి.

ఉదయం నుంచే..

జిల్లాలో బుధవారం రోజంతా ఉష్ణోగ్రతల తీరును పరిశీలిస్తే.. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా నమోదైంది. 40డిగ్రీల సెల్సియస్ నుంచి మొదలుకుని క్రమంగా 44–45 వరకూ వెళ్లింది. మధ్యాహ్నం 12గంటల తర్వాత నుంచి సాయంత్రం 5గంటల వరకూ ఈ ఉష్ణతీవ్రత కొనసాగింది. రాత్రి 7.30గంటల వరకూ వేడివాతావరణమే ఉంది. ఎండ వేడికి వాటర్ ట్యాంకుల్లోని నీళ్లు సైతం బాయిలర్లలో వేడిచేసినట్లు సలసల కాగా యి. ఓవైపు తీవ్రమైన ఎండ, మరోవైపు కూలర్లలో పోసుకుందామన్నా.. ట్యాంకుల్లో నుంచి వేడినీళ్లు రావడంతో జనాలు ఇబ్బందులు పడ్డారు. రోజువారీ పనులు చేసుకునే వారి ఇబ్బందులు వర్ణనాతీతం.

జాగ్రత్త పడాల్సిందే..

రోహిణి ఎండలకు రోకళ్లు కూడా పగులుతాయని పెద్దలు చెప్పినట్లు ఈ ఉష్ణోగ్రతలకు జిల్లావాసులు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఒకట్రెండు రోజుల నుంచి నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు మరికొన్ని రోజులపాటూ కొనసాగనున్నట్లు వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ఒకట్రెండు రోజులపాటు 43–44డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చన్న నివేదికలతో జిల్లావాసులు బెంబేలెత్తుతున్నారు. ఈక్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ సమయంలో కచ్చితంగా అవసరమైతేనే బయటకు వెళ్లాలని, అదికూడా తగు జాగ్రత్తలతో వెళ్లాలని చెబుతున్నారు.

వడదెబ్బ కొట్టింది..

రెండుమూడు రోజుల వ్యవధిలోనే జిల్లాలో వడదెబ్బ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా చిన్నారులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతున్నా రు. ఇంటిపట్టున్న ఉంటున్నప్పటికీ ఎండ వేడిమి తగలడం, నీటిని ఎక్కువగా తాగకపోవడంతో వా రు అస్వస్థతకు గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని చిన్నపిల్లల ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో వడదెబ్బ బాధిత చిన్నారులు ఉండటం గమనార్హం. వృద్ధులు కూడా వేడిని తట్టుకోలేక అస్వస్థతకు గురవుతున్నారు. రెండురోజులుగా ఉపాధి హామీ కూలీల్లోనూ చాలామంది వడదెబ్బ బారిన పడినట్లు చెబుతున్నారు. ఈక్రమంలో కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

చిన్నారులు జాగ్రత్త..



వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్న సమయంలో చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి. ఎండలో ఎట్టిపరిస్థితుల్లో ఆడుకోనివ్వద్దు. తరచూ మంచినీరు తాగించాలి. వీలైతే ఓఆర్‌ఎస్, కొబ్బరినీళ్లు తాగించాలి. వడదెబ్బ తగిలితే నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ స్వప్న, చిన్నపిల్లల వైద్యురాలు, నిర్మల్

ఇంటి నిర్మాణం.. భారం!

- స్టీల్, ఇసుక, సిమెంట్ ధరలకు రెక్కలు
- పెరిగిన కూలీ రేట్లు
- బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు



నిర్మాణ పనుల్లో కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: సామాన్యుల సొంతింటి కల మరింత భారంగా మారింది. రోజురోజుకూ నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతుండడంతో నిర్మాణ వ్యయం పెరుగుతోంది. తాజాగా స్టీల్, సిమెంటు, ఇసుక, ఇటుక రేట్లు పెరిగాయి. దీంతో ఇంటి నిర్మాణం ప్రారంభించిన పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతేడాదితో పోలిస్తే నిర్మాణ వ్యయం రెట్టింపయిందని పేర్కొంటున్నారు.

అంచనాలు తారుమారు..

ఇంటి నిర్మాణం పనులు మొదలు పెట్టాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముడి సరుకుల ధరలు పెరుగుతుండటంతో బడ్జెట్ అంచనాలు తారుమారవుతున్నాయి. అప్పు చేసినా ఇంటి నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి కనబటంలేదని మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్, సిమెంట్, ఇసుక, ఇటుకతోపాటు పీవీసీ విద్యుత్, ప్లంబింగ్ మెటీరియల్, కలర్స్‌తోపాటు కూలీ రేట్లు కూడా భారీగా పెరిగాయి. వెయ్యి చదరపు అడుగుల ఇల్లు కట్టుకుంటే గతేడాదికన్నా ఐదారు లక్షలు అదనంగా భారం పడుతోంది. నిర్మాణం పనులు ప్రారంభించిన వారు బడ్జెట్ అంచనాలు పెరగడంతో పనులు ఆపేస్తున్నారు. కొత్తగా నిర్మాణం మొదలు పెట్టాలనుకునే వారు ధరలను చూసి పునరాలోచనలో పడ్డారు.

ఇసుక రేట్లు డబుల్...

ఇళ్ల నిర్మాణంలో ఇసుకకు ప్రాధాన్యం ఎక్కువ. వీటిలో రెండు రకాలు ఉంటాయి. కట్టడానికి ఉపయోగించే ఇసుక టన్నుకు రూ.2,800 వరకు పలుకుతోంది. ప్లాస్టింగ్‌కు వాడే సన్నరకం ఇసుక టన్నుకు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు అమ్ముతున్నారు. గతేడాది ఇసుక రేటు టన్నుకు రూ. 1,300 ఉండగా ప్రస్తుతం డబుల్ అయ్యింది. ఇసుక కొరతతోపాటు ఓవర్‌లోడ్ కు అనుమతులు ఇవ్వకపోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పునాదులు, స్లాబ్‌కు ఉపయోగించే కంకర ధర కూడా పెరిగింది. టన్నుకు రూ.1,500 నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు. స్టీల్ ధర టన్ను రూ.60 వేలకు పెరిగింది. సిమెంట్ ధరలు కంపెనీ బట్టి రూ.360 వరకు ఉంది. కూలీల రేట్లు కూడా విపరీతంగా పెరిగాయి. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టైల్స్, కలర్, కిటికీలకు ఉపయోగించే యూపీవీసీ, కలప తదితర వస్తువుల ధరలు కూడా 25 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగాయి. పెరిగిన ధరలతో కాంట్రాక్టర్లు కూడా ఆందోళన చెందుతున్నారు. అగ్రిమెంట్ చేసుకున్న సమయంలో ఉన్న ధరలు ప్రస్తుతం ఉన్నవాటికి చాలా వ్యత్యాసం ఉండటంతో నష్టపోతున్నామని అంటున్నారు.

కోవిడ్ తర్వాత సొంత ఇంటిపై దృష్టి..

కోవిడ్ తర్వాత చాలా మంది చిన్నదో పెద్దతో సొంత ఇల్లు ఉండాలన్న నిర్ణయానికి వచ్చారు. దీంతో కోవిడ్ తర్వాత నిర్మాణరంగం ఊపందుకుంది. అప్పటి నుంచి మొదలైన ధరల మోత ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. మొదట లేబర్ చార్జీలు పెరిగాయి. ఆ తర్వాత ముడి సరుకుల ధరలకు రెక్కలు వచ్చాయి. సొంతంగా దగ్గరుండి ఇల్లు కట్టించుకుంటే గత సంవత్సరం చదరపు అడుగుకు రూ.1,400 నుంచి రూ.1,500 వరకు ఖర్చు అయ్యేది. అదే కాంట్రాక్టుకు ఇస్తే రూ.1,600 నుంచి రూ.1,700 వరకు వ్యయం చేయాల్సి వచ్చేది. ఇంటీరియర్స్‌కు అదనం. ప్రస్తుతం పెరిగిన ధరలతో సొంతంగా ఇల్లు కట్టించుకున్నా చదరపు అడుగుకు రూ.1,800 నుంచి రూ.1,900 వరకు అవుతుండగా, కాంట్రాక్టుకు ఇస్తే రూ.2,000 నుంచి రూ.2,200 వరకు తీసుకుంటున్నారు.

పనులు తగ్గాయి..

ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో నిర్మాణం పనులు తగ్గాయి. ఇసుక, సిమెంట్, స్టీల్, డస్ట్, కంకర్, ఇతర మెటీరియల్ రేట్లు భారీగా పెరిగాయి. గతేడాది అగ్రిమెంట్ చేసుకున్న పనులకు నష్టం వస్తుంది. ఇసుక రేటు డబుల్ అయింది. లేబర్ చార్జీలు కూడా పెంచారు. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి. లేదంటే నిర్మాణం రంగం దెబ్బతింటుంది.

– ఆశిష్, మేస్త్రీ

మార్కెట్‌కు పోటెత్తిన జొన్నలు



మార్కెట్ వద్ద క్యూకట్టిన జొన్నల వాహనాలు

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం జొన్నలు పోటెత్తాయి. ఏప్రిల్ 18 నుంచి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ నెల 31న కొనుగోళ్లు నిలిపివేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. దీంతో మండలంలోని రైతులు వాహనాల్లో భారీగా జొన్నలను మార్కెట్‌కు తీసుకువచ్చారు. మార్కెట్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు జొన్నల వాహనాలు బారులు తీరాయి. ఇప్పటి వరకు మార్కెట్‌లో 22,436 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 5,100 ఎకరాల్లో జొన్న పంట వేశారు. ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున 62 వేల క్వింటాళ్ల జొన్నలు మార్కెట్‌కు వస్తాయని అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు 30 శాతం జొన్నలు మాత్రమే మార్కెట్‌కు వచ్చాయి. ఈ నేపథ్యంలో జొన్న కొనుగోళ్ల గడవు పెంచాలని మండల రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మే 10వ తేదీ వరకు జొన్నలు విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు అధికారులు తెలిపారు.

'బడిబాట'కు వేళాయె

- జూన్ 3 నుంచి 19 వరకు కార్యక్రమం
- సర్కారు బడిలో ప్రవేశాల పెంపే లక్ష్యం
- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు (ఫైల్)

నిర్మల్ రూరల్/ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఏటా మాదిరిగానే ఈసారి కూడా పాఠశాలలు పునఃప్రారంభానికి ముందు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. జూన్ 3 నుంచి 19 వరకు కార్యక్రమాన్ని నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేసింది. చిన్నారులను ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో 1వ తరగతిలో, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 6వ తరగతిలో చేర్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. నెల రోజులుగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల సిబ్బంది గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను తమ స్కూళ్లలో చేర్పించారు. ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను ఒప్పించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ఓ సవాలే.

ప్రైవేటువైపే మొగ్గు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లోనే చేర్పించినట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టినప్పటికీ ఆశించిన మార్పు కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరతతో ఆర్థిక భారమైనప్పటికీ ప్రైవేట్ వైపే మొగ్గు చూపుతున్నారు.

ఖాళీలతో సతమతం..

దీఈవో పరిధిలోని	
ప్రభుత్వ పాఠశాలలు	1041
ప్రాథమిక	591
ప్రాథమికోన్నత	202
ఉన్నత	246
విద్యార్థుల సంఖ్య	1,30,135
ఒక్క విద్యార్థి లేని స్కూళ్లు	49
జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు	2958
ఖాళీగా ఉన్న పోస్టులు	578

సర్కారు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలో మొత్తం 2958 మంది ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, 578 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యార్థులు లేరు.. విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయులు లేని పరిస్థితి. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు జిల్లాలో 49 ఉన్నాయి.

మౌలిక వసతులు లేకపోవడంతోనే..

సర్కారు బడుల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య పెరగడం లేదని తెలుస్తోంది. అయితే గత ప్రభుత్వం మన ఊరు –మన బడి పేరిట కార్యక్రమం చేపట్టినా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. కొన్ని పాఠశాలల్లో మాత్రమే అభివృద్ధి పనులు జరిగాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బడులు పునఃప్రారంభించేలోగా పూర్తయ్యే అవకాశం కానరావడం లేదు. తాగునీరు, మరుగుదొడ్లు, ఆటస్థలం, ఇతర మౌలిక వసతులు లేని కారణంగా తల్లిదండ్రులు వారి పిల్లలను ఈ పాఠశాలలకు పంపించేందుకు మొగ్గు చూపడం లేదు.

మార్గదర్శకాలకు అనుగుణంగా బడిబాట

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తాం. ఇప్పటికే ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. జూన్ 3 నుంచి 19 వరకు పండగ వాతావరణంలో ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధుల సహకారంతో బడిబాట చేపడతారు. విద్యార్థుల నమోదు శాతం పెంచాలి. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉన్న స్కూళ్లపై దృష్టి పెడతాం. గుణాత్మక విద్య సాధన గురించి తల్లిదండ్రులకు వివరిస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

యూనిఫాం త్వరగా సిద్ధం చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



యూనిఫాం స్టిచింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభం రోజే అందించేలా యూనిఫాంలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మంజులాపూర్‌లో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్న టైలరింగ్ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. యూనిఫాం స్టిచింగ్ నాణ్యతతో వేగంగా చేయాలని సూచించారు. విద్యార్థుల నుంచి తీసుకున్న కొలతల ప్రకారమే దుస్తులను సిద్ధం చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికిముందే యూనిఫాంలు పాఠశాలలకు చేర్చాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య, ఇప్పటివరకు తయారైన, తయారు కావాల్సిన యూనిఫాంల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'అమ్మ ఆదర్శ' పనులు పరిశీలన

అనంతరం సిద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించారు. జూన్ 5లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులన్నీ పారదర్శకంగా చేయాలని, కొనుగోలు చేసిన సామగ్రి, పూర్తి చేసిన పనులకు సంబంధించిన వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట డీఈవో రవీందర్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, మండల విద్యాశాఖ అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

సోన్: సోన్ మండలం న్యూవెల్మల్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ డీఈవో రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. జూన్ 5లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, పెండింగ్ పనుల వివరాలు తెలుసుకున్నారు. పనులన్నీ పారదర్శకంగా చేపట్టాలన్నారు. డీఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మ పీడీ సుభాష్, ఈఈ శంకరయ్య, ఏఈ గురునాథం, ఎంపీడీవో సురేశ్, ఎంపీవో ఖలీల్ హైమద్, ఏపీఎం గంగమణి, కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న అంజిప్రసాద్

పెంబి: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని షెట్‌పల్లిలో నకిలీ విత్తనాలపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పెంబి రైతు వేదికలో ఫర్టిలైజర్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన చట్టాలకు లోబడే విక్రయాలు నిర్వహించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. మండల పరిధిలో పత్తి విత్తనాలు రైతులకు సరిపడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోకి నకిలీ విత్తనాలు ప్రవేశించకుండా పోలీస్, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖానాపూర్ డివిజన్ సహాయ సంచాలకులు సుజాత, ఏఈవోలు రాజ్‌కుమార్, గంగజల పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై విచారణ



చాక్‌పల్లిలో విచారణ చేస్తున్న అధికారులు

నర్సాపూర్ (జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో గతంలో పట్టుబడ్డ ఇసుక డంపులు రాత్రి పూట వేరే చోటికి అక్రమ రవాణాపై పలు ఫిర్యాదులు అందడంతో సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర మైనింగ్ అధికారి విచారణకు ఆదేశించారు. ఈమేరకు జిల్లా మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, తహసీల్దార్ శ్రీనివాస్ చాక్‌పల్లి గ్రామపంచాయతీలో విచారణ చేపట్టారు. సహజ వనరుల దోపిడీ, అక్రమ ఇసుక రవాణా చట్టరీత్యా నేరమన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ట్రాక్టర్లు సీజ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గృహ నిర్మాణ కోసం ఇసుక కావాల్సి ఉంటే ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలు చూపి అవసరానికి తగిన ఇసుకను రాయల్టీ చెల్లించి తీసుకెళ్లాలని సూచించారు. ఇంటి నిర్మాణం పేరుతో అక్రమంగా డంపులు చేసి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణలో ఆర్‌ఐ సుమలత, గ్రామపంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నంది అవార్డు అందుకున్న చిన్నారి



వేణుగోపాలచారి చేతుల మీదుగా నంది అవార్డు అందుకుంటున్న నిగులపు హరిత

నిర్మల్‌టౌన్‌: ఎన్టీఆర్‌ 101వ జయంతి వేడుకలను హైదరాబాద్‌లో శిఖరం ఆర్ట్స్‌ థియేటర్స్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో జిల్లా కేంద్రంలోని కురన్నపేట్‌కు చెందిన నిగులాపు హరిత అత్యుత్తమ ప్రదర్శ ఇచ్చింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేణుగోపాలచారి చేతుల మీదుగా నంది అవార్డు అందుకుంది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన హరితను, శిక్షకురాలు అంజలిరెడ్డిని పట్టణ ప్రజలు అభినందించారు.

మూడు టిప్పర్లు పట్టివేత



పట్టుబడిన మూడు టిప్పర్లు

బేల: మండలంలోని దహెగాం క్రాస్‌ వద్ద మంగళవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాధిక పేర్కొన్నారు. కాంగార్‌పూర్‌ రెవెన్యూ గ్రామ శివారు పెన్‌గంగ నుంచి ఇసుకను అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేశామన్నారు. పట్టుకున్న టిప్పర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు బుధవారం నివేదించినట్లు తెలిపారు.

మోపెడ్‌ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని సవర్గాం రహదారిపై మోపెడ్‌ అదుపు తప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. గుడిహత్నూర్‌ మండలం కొల్హారి గ్రామానికి చెందిన జాదవ్‌ హరిదాస్‌ ఆయన మనువడు సతీశ్‌తో కలిసి బుధవారం కుంటాల గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి పడడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

నలుగురి అరెస్ట్‌

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన సాకలి శంకర్‌ కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రావు, భోజన్న, రాజేశ్వర్‌ ఈనెల 24 దాడి చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో బిలోలి గ్రామానికి చెందిన నలుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు లోకేశ్వరం పోలీస్‌ స్టేషన్‌ను ముట్టడించారు. దీంతో ప్రత్యేక పోలీసుల సహాయంలో నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రావు, భోజన్న, రాజేశ్వర్‌ను ప్రత్యేక వాహనంలో రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

తపాలా బీ(ధీ)మా..



- తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజీ
- సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం

భైంసాటౌన్‌: అనుకోని ప్రమాదాల్లో ఎవరైనా చనిపోతే వారిపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి దయనీయం. భార్య/భర్త మరణిస్తే వారి పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. అందుకే ఇటీవలి కాలంలో ప్రమాదబీమాపై చాలామందిలో అవగాహన పెరిగింది. ఈ క్రమంలో తపాలా శాఖ తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ ప్రయోజనం చేకూరేలా ప్రమాద బీమా పథకాలను అందుబాటులోకి తెచ్చింది. రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల ప్రయోజనంతో హెల్త్‌ప్లస్‌, ఎక్స్‌ప్రెస్‌ హెల్త్‌ ఇన్సూరెన్స్‌ స్కీంలను ప్రవేశపెట్టింది. వీటిని సద్వినియోగం చేసుకుంటే తమపై ఆధారపడిన కుటుంబసభ్యులకు ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తకుండా చూడొచ్చు.

రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల బీమా..

నివా హెల్త్‌ ఇన్సూరెన్స్‌, తపాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తక్కువ ప్రీమియంతో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల ప్రమాద బీమా అందిస్తోంది. 18 నుంచి 65 ఏళ్లలోపు వారు ఈ పథకానికి అర్హులు. ఏడాదికి ఒకేసారి రూ.555 ప్రీమియంతో రూ.10 లక్షలు, రూ.755తో రూ.15 లక్షల ప్రయోజనం పొందవచ్చు. పాలసీదారు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భాల్లో మాత్రమే వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు బీమా ప్రయోజనం అందుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి...

నివా హెల్త్‌ ఇన్సూరెన్స్‌, పోస్టల్‌ శాఖ ఆధ్వర్యంలో హెల్త్‌ ప్లస్‌, ఎక్స్‌ప్రెస్‌ హెల్త్‌ ఇన్సూరెన్స్‌ స్కీంలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఆరుగురికి క్లెయిమ్‌ మొత్తం బీమా మొత్తం అందించాం. ప్రీమియం ప్రారంభించిన 15 రోజుల తరువాత నుంచి బీమా వర్తిస్తుంది. పాలసీదారు మృతి చెందితే, ఎఫ్‌ఐఆర్‌ కాపీ, ఇతర ధ్రువపత్రాలతో క్లెయిమ్‌ చేసుకున్న నెలరోజుల్లో బీమా ప్రయోజనాలు అందుతాయి. అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలి.

– జి.దిలీప్‌కుమార్‌, పోస్ట్‌ ఇన్‌స్పెక్టర్‌, భైంసా సబ్‌ డివిజన్‌

మరెన్నో ప్రయోజనాలు..

తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న హెల్త్‌ ప్లస్‌, ఎక్స్‌ప్రెస్‌ ఇన్సూరెన్స్‌ స్కీంలతో ప్రమాదవశాత్తు మృతి చెందినా, ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం కలిగినా, కాలు/చేయి కోల్పోయినా, పక్షవాతం సంభవించినా బీమా డబ్బు మొత్తం చెల్లిస్తారు. అలాగే పాలసీదారు పిల్లలు చదువుకుంటూ ఉంటే అదనంగా రూ.50 వేలు/రూ.లక్ష వరకు ప్రయోజనం పొందవచ్చు. పెళ్లీడుకు వచ్చిన పిల్లలుంటే వివాహ ఖర్చులకు రూ.50 వేలు/లక్ష వరకు ప్రయోజనం. ప్రమాదంలో గాయాలతో ఆస్పత్రిలో చేరితే వైద్య ఖర్చులకు రూ.లక్ష వరకు చెల్లిస్తారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో రోజుకు రూ.500/1000 వరకు, ఐసీయూలో ఉంటే రూ.1000/2000 అందిస్తారు. పాలసీదారు మృతి చెందితే అంత్యక్రియల ఖర్చుకు రూ.5 వేల ఆర్థిక సహాయం పొందవచ్చు. ప్రమాదంలో ఎముకలు విరిగితే రూ.25 వేల వరకు పొందవచ్చు. పాలసీ గడువు కాలంలో ఒకసారి ఆరోగ్య తనిఖీ, అపరిమిత టెలి కన్సల్టెన్సీ ప్రయోజనాలు పొందవచ్చు.

'స్థానిక'లో 42శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

- సెక్రటేరియెట్‌ ముట్టడి విజయవంతం చేయండి
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్‌

ఎదులాపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధనే లక్ష్యంగా బీసీ జనసభ పోరాటం కొనసాగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్‌ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం 'చలో సెక్రటేరియట్‌' కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీ బీసీలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. కులగణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ఆ పార్టీ నేతలు ఎన్నికలకు ముందు ప్రకటించారని గుర్తు చేశారు. అయితే ఆ హామీని తుంగలో తొక్కుతూ జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్‌ సర్కారు సన్నద్ధమవుతుందన్నారు. కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అప్పటివరకు వాయిదా వేయాలని డిమాండ్‌ చేశారు. ఇందులో భాగంగా జూన్‌ 8న హైదరాబాద్‌ ఇందిరాపార్క్‌ వద్ద మహాధర్నా, 15న సెక్రటేరియట్‌ ముట్టడి చేపడుతున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో జిల్లా బీసీ నాయకులు చిక్కాల దత్తు, హన్మండ్లు యాదవ్‌, కృష్ణమీనన్‌, మహేందర్‌, ఆశన్న, రవికాంత్‌, రమేశ్‌, శ్రీకాంత్‌, నాగయ్య, సతీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు బోనస్‌ మళ్లించిన ఆపరేటర్‌పై కేసు

ఇంద్రవెల్లి: తునికాకు సేకరణ కూలీల డబ్బులను తన కుటుంబ సభ్యుల అకౌంట్లకు మళ్లించిన డాటా ఎంట్రీ ఆపరేటర్‌ మంచికంటి ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2016 నుంచి 2021 వరకు ఇంద్రవెల్లి రెంజ్‌ పరిధిలో చేపట్టిన తునికాకు సేకరణ కూలీల వివరాలను రెంజ్‌ అధికారి సంతోష్‌ ఆదిలాబాద్‌ డివిజనల్‌ కార్యాలయానికి పంపారు. అయితే ఈ నివేదికను ఇంద్రవెల్లి రెంజ్‌ ఆఫీస్‌లో అవుట్‌ సోర్సింగ్‌ డాటా ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మంచికంటి ప్రశాంత్‌ సిద్ధం చేశాడు. ఈ క్రమంలో అందులో తునికాకు సేకరించినట్లుగా తనతో పాటు కుటుంబ సభ్యులైన మంచికంటి సునిత, మంచికంటి అంకిత పేర్లు, బ్యాంకు అకౌంట్‌ నంబర్లు నమోదు చేశాడు. ఇందులో భాగంగా ఆ శాఖ నుంచి విడుదలైన బోనస్‌ డబ్బుల్లో తనతో పాటు కుటుంబ సభ్యుల ఖాతాల్లో రూ.6 లక్షల 64వేల 845 జమ అయ్యాయి. ఈ విషయం రెంజ్‌ అధికారి సంతోష్‌ ప్రాథమిక పరిశీలలో బయటపడింది. ఆయన ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌ జిల్లా ఉపాధ్యాయుడికి విశిష్ట గౌరవం



పోతన్నను సన్మానిస్తున్న తెలంగాణ సారస్వత పరిషత్‌ సభ్యులు

సోన్‌: హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఆధ్వర్యంలో బాల సాహిత్య సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఇందులో సోన్‌ మండలం న్యూవెల్మల్‌ బొప్పారం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కొండూరి పోతన్నకు విశిష్ట గౌరవం దక్కింది. పోతన్న ప్రముఖ వక్తగా పాల్గొని బడిలో తెలుగు అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం పోతన్నను నిర్వాహకులు సన్మానించారు. పోతన్న కొన్నేళ్లుగా సమాజానికి, పాఠశాల విద్యార్థులకు చేస్తున్న సాహితి సేవకు ఈ గుర్తింపు లభించిందని పాఠశాల హెచ్‌ఎం విద్యాసాగర్‌ అభినందించారు.

అడవి పందుల అక్రమ రవాణా

సోన్‌: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్‌ వద్ద పది అడవి పందులను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులకు అటవీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ ఫాజిల్‌ హుస్సేన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌ జిల్లా భైంసా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాకు అడవి పందులను అక్రమంగా రవాణా చేస్తున్నారని అందిన సమాచారంతో అప్రమత్తమైన అటవీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఏపీ 39 యూబీ 8419 నంబర్‌ వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. దీనిని తనిఖీ చేయగా వాహనంలో 10 అడవి పందులు కనిపించాయి. ఆరు మృతి చెందాయని, నాలుగు సజీవంగా ఉన్నట్లు తెలిపారు. వాహనంలో ఉన్న ఇద్దరిని విచారణ చేయగా, తాము ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారమని తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వన్య ప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం అరెస్ట్‌ చేసి ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ ముందు హాజరుపర్చారు. మేజిస్ట్రేట్‌ వీరికి 14 రోజుల రిమాండ్‌ విధించారు.



పట్టుకున్న వాహనంలో అడవి పందులు

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

సారంగపూర్‌: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన చౌహాన్‌ మాన్‌సింగ్‌ అనే రైతుకు చెందిన ఎద్దు బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. రైతు మాన్‌సింగ్‌ తన రెండు ఎద్దులను మేత కోసం సమీప పంటపొలాల్లోకి తీసుకుని వెళ్లాడు. ఈక్రమంలో అప్పటికే తెగిపడి ఉన్న 11కేవీ విద్యుత్‌ లైన్‌కు ఒక ఎద్దు తగిలి అక్కడిక్కడే మృతిచెందింది. వెంటనే విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు తెలుపడంతో వారు విద్యుత్‌ సరఫరా నిలిపివేశారు. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

కుక్క పిల్లలకు బారసాల



భోజనం తింటున్న కుక్క, పక్కన పిల్లలు

కుభీర్‌: నిర్మల్‌ జిల్లా కుభీర్‌ మండల కేంద్రంలోని శ్రీకృష్ణకాలనీకి చెందిన రావుల చంటి తాను పెంచుతున్న కుక్కకు పుట్టిన పిల్లలకు బుధవారం బారసాల నిర్వహించారు. రెండేళ్లుగా పెంచుతున్న కుక్కకు మూడు రోజుల క్రితం మూడు పిల్లలకు జన్మనిచ్చింది. దీంతో బుధవారం బారసాల నిర్వహించారు. కొత్త వస్త్రాలను కుక్కకు కప్పాడు. తర్వాత దానికి ఇష్టమైన వంటకాలు చేసి అందించాడు. తర్వాత చుట్టుపక్కల వారిని పిలిచి భోజనాలు పెట్టాడు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాలలో 1990–91లో ఎస్సెస్సీ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్టణంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో బుధవారం నిర్వహించారు. పదో తరగతి తర్వాత ఉన్నత చదువులు పూర్తి చేసి ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ కలిశారు. 33 ఏళ్ల అనంతరం మళ్లీ ఒక్క చోటకు చేరారు. ఆత్మీయ అలింగనాల అనంతరం నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. గురువులను సన్మానించారు. పూర్వవిద్యార్థులు దుర్గం శేఖర్‌, నరేందర్‌ బాబు, మతీన్‌, అజాంఖాన్‌, శ్రీను, వెంకటేశ్‌, స్వామి, తిరుపతి, కౌసర్‌, గంగాధర్‌, కిషన్‌ పాల్గొన్నారు.

విద్యుత్‌ తీగలు తగిలి యువకుడి మృతి



పుప్పాల మహేష్‌(ఫైల్‌)

నెన్నెల: మండల కేంద్రంలోని సుంకరివాడకు చెందిన పుప్పాల మహేష్‌(32) బుధవారం విద్యుత్‌ తీగలు తగిలి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్‌ తన భార్య స్వప్నతో కలిసి పరిగే మామిడికాయలు కోసేందుకు జంగాల్‌పేటకు వెళ్లాడు. జంగాల్‌పేట కొత్తగూడంలో మామిడి చెట్టెక్కి కాయలు కోస్తుండగా చెట్టుపై నుంచి వెళ్లే విద్యుత్‌ తీగలు తగలడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి కూతురు హని(12), కుమారుడు చరణ్‌(10) ఉన్నారు.

వడదెబ్బతో గిరిజన యువకుడు మృతి

తాండూర్‌: మండలంలోని అబ్బాపూర్‌ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు టోకెమ్‌ భీమ్‌రావు (26) బుధవారం వడదెబ్బ తగిలి మృతిచెందాడు. మాదారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌రావు తన స్నేహితులతో కలిసి సోమవారం సోనాపూర్‌ గ్రామంలో జరిగిన పెళ్లికి ఎండలో నడుచుకుంటూ వెళ్లాడు. పెళ్లి తంతు ముగిశాక మంగళవారం రాత్రి ఇంటికి చేరిన కొద్ది సేపటికే వాంతులు చేసుకున్నాడు. బుధవారం భీమ్‌రావును కుటుంబీకులు బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. భీమ్‌రావు తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతిచెందగా పెదనాన్న టోకెమ్‌ దోబీ వద్ద ఉంటున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



భీమ్‌రావు మృతదేహం

నెన్నెలలో హమాలీ కార్మికుడు..

నెన్నెల/భీమిని: నెన్నెల మండల కేంద్రానికి చెందిన హమాలీ కార్మికుడు తోట తిరుపతి(36) బుధవారం వడదెబ్బతో మృతిచెందాడు. తోటి హమాలీలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం కన్నెపల్లి మండలం ఖాజీపల్లి గ్రామంలో వడ్లు తూకం వేసి లోడ్‌ చేసేందుకు తోటి హమాలీలతో కలిసి వెళ్లాడు. ధాన్యం బస్తాలను డీసీఎం వ్యాన్‌లో లోడ్‌ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరాడు. నీళ్లు తాగించి ఆ స్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. కన్నెపల్లి పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శ్రీలత, కుమారులు శ్రేయాన్‌(7), హర్షవర్ధన్‌(4) ఉన్నారు.

ఇంటి నిర్మాణం అడ్డుకుంటున్నారని నిరసన

- పంచాయతీ కార్యాలయానికి సామగ్రితో వెళ్లిన యజమాని
- నిరాశ్రయుడిని అయ్యానని ఆవేదన



ఇంటి సామగ్రితో కార్యాలయంలో బాధితుడు

ఖానాపూర్‌: నిర్మల్‌ జిల్లా ఖానాపూర్‌ మండలం తర్లపాడ్‌ గ్రామానికి చెందిన దర్శనాల రాజేశ్వర్‌ తన ఇంటి నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకుంటున్నారని పంచాయతీ కార్యాలయం ఎదుట ఇంట్లోని సామగ్రితో బుధవారం నిరసన తెలిపాడు. తన పాత ఇల్లు కూలిపోవడంతో పక్కనే ఉన్న స్థలంలో కొత్త ఇంటి నిర్మాణం మొదలు పెట్టానని పేర్కొన్నాడు. అయితే పనులను గ్రామ పెద్దలు అడ్డుకుని తనకు తీవ్ర నష్టం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. పనులు నిలిపివేయడంతో నిరాశ్రయుడిని అయ్యానని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు విచారణ జరిపి ఇంటి నిర్మాణం కొనసాగేలా చూడాలని కోరాడు. కాగా, ఈ విషయమై పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. రాజేశ్వర్‌ తన ఇంటి ముందు నుంచి ఉన్న దారిలో నిర్మాణం చేపట్టాడని తెలిపారు. దీంతో అతని ఇంటి వెనక ఉండే వారికి దారి లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఇలా నిర్మాణం చేయొద్దని కోరినా పట్టించుకోలేదు. దీంతో అందరి సమక్షంలో మాట్లాడాక పనులు చేయాలని సూచించామని తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి షేక్‌ రిజ్వానాను వివరణ కోరగా.. ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోవడానికి తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. పంచాయతీ కార్యాలయం ఎదుట అక్రమంగా నిరసన తెలిపినందుకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్‌ ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌



మాట్లాడుతున్న పాయల్‌ శంకర్‌

ఆదిలాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌ ఆరోపించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతులకు విత్తనాల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిపడా విత్తనాలు దొరక్క రైతులు దుకాణాల వద్ద బారులు తీరాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అలాగే సీఎం రేవంత్‌ రెడ్డి రైతులకు రుణమాఫీ చేస్తానని మాట తప్పారని మండిపడ్డారు. సమావేశంలో పలువురు బీజేపీ నాయకులున్నారు.

వరుస చోరీల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసులు, డీసీపీ అశోక్‌కుమార్‌, ఏసీపీ వెంకటేశ్వర్లు

- రూ.10.97లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాసులు

జైపూర్‌: వేమనపల్లి మండలం నీల్వాయి పోలీసుస్టేషన్‌ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. రూ.10.97లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జైపూర్‌ అసిస్టెంట్‌ కమిషనరేట్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం సీపీ శ్రీనివాసులు మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 26, 27వ తేదీల్లో అర్ధరాత్రి కల్మలపేట గ్రామానికి చెందిన సల్పల శ్రీనివాస్‌ అలియాస్‌ లింగయ్య తాళం వేసి ఉన్న ఇళ్లలో బంగారం, వెండి, నగదు చోరీకి పాల్పడ్డాడు. కేతనపల్లి గ్రామానికి చెందిన నెందుగరి రామన్న ఫిర్యాదు మేరకు నీల్వాయి ఎస్సై శ్యామ్‌పటేల్‌, చెన్నూర్‌రూరల్‌ సీఐ సుధాకర్‌ చెన్నూర్‌ రూరల్‌ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. మంగళవారం మల్లంపేట గ్రామం వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన సల్పల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. బ్యాగు తనిఖీ చేయగా బంగారం, వెండి ఆభరణాలతోపాటు రూ.2,62,600 నగదు లభించాయని, మొత్తం విలువ రూ.10,97,600 ఉంటుందని సీపీ వివరించారు. సీఐ సుధాకర్‌, ఎస్సై శ్యామ్‌పటేల్‌, పోలీస్‌ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో జైపూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

పల్లెల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీనివాసులు హెచ్చరించారు. నిందితులపై పీడీ యాక్ట్‌ నమోదు చేస్తామని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించి మోసాలకు పాల్పడుతున్న దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

జైపూర్‌: మండలంలోని కాన్కూర్‌ గ్రామానికి చెందిన నెండుగూరి సురేశ్‌(32) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జైపూర్‌ అదనపు ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాన్కూర్‌ గ్రామానికి చెందిన నెండుగూరి లక్ష్మి, బాపు దంపతుల చిన్న కుమారుడు సురేశ్‌ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగుతూ ఉండేవాడు. ఈ నెల 27న వ్యవసాయ పొలం వద్ద పడుకోవడానికి వెళ్లి ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్సై తెలిపారు.



మృతుడు సురేశ్‌ (ఫైల్‌)